## స్ట్రాటజిక్ మెటీరియల్స్ హబ్'గా ఏపీ

● టైటానియం, అరుదైన ఖనిజాల మిషన్‌కు రూపకల్పన ● 10 ఏళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాల లక్ష్యం ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఆంధ్రప్రదేశ్ను సమగ్ర 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్స్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఏపీ-టిఎస్ఎంఎం)' రూపకల్పన, పెట్టుబడులు తదితర అంశాలపై సీఎం అధికారులతో చర్చించారు. ఈ మిషన్ ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని సీఎం తెలిపారు. వచ్చే పది సంవత్సరాల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి సుమారు 40 వేల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అరుదైన ఖనిజాల వినియోగంలో కేంద్రం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులపై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు.రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే బీచ్ సాండ్ ఖనిజాలు దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. ముఖ్యంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. ఈ ఖనిజాలు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా, ఎయిరోస్పేస్, రక్షణ రంగం, శస్త్రచికిత్స పరికరాలు, సిరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణుఇంధనం వంటి కీలక రంగాలకు అవసరమని పేర్కొన్నారు.రాష్ట్రంలో లభించే ఖనిజాలను సమర్థంగా వినియోగించేందుకు మూడు ప్రధాన ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో సంవత్సరానికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో టైటానియం పార్క్, అనకాపల్లిలో సంవత్సరానికి 25 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో రేర్ ఎర్త్ కారిడార్, మచిలీపట్నంలో సమగ్ర టైటానియం--రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనులు,ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కార్మికులకు సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించడమే ఈఎస్ ఐ పథకం లక్ష్యం

: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి కార్మికులకు ఆరోగ్య భద్రత, సామాజిక రక్షణ కల్పించడంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) పథకం కీలక పాత్ర పోషిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈఎస్ఐ పథకం సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.భారతదేశంలో 1948లో అమలులోకి వచ్చిన ఈఎస్ఐ చట్టం కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చారిత్రాత్మక చట్టమని ఆయన తెలిపారు. అనారోగ్యం, ప్రసూతి, వికలాంగత లేదా పని సమయంలో జరిగే ప్రమాదాల వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల నుండి కార్మికులు మరియు వారి కుటుంబాలకు రక్షణ కల్పించడం ఈ పథక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్లో 1955 నుంచే ఈఎస్ఐ పథకం అమలులోకి వచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం విస్తరించి వేలాది పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్నదని మంత్రి తెలిపారు.రాష్ట్రంలో కార్మికులకు చేరువగా వైద్య సేవలు అందించేందుకు విస్తృత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 79 ఈఎస్ఐ డిస్పెన్సరీలు పనిచేస్తుండగా, వాటిలో సుమారు 100 మంది వైద్యులు సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా కార్మికులు మరియు వారి కుటుంబాలకు ప్రాథమిక వైద్య సేవలు, ఔట్పేషంట్ చికిత్స, నివారణ ఆరోగ్య సేవలు మరియు అవసరమైనప్పుడు ఉన్నత వైద్యసంస్థలకు రిఫరల్ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.కార్మికుల సంక్షేమం మరియు ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈఎస్ఐ సేవలను మరింత విస్తరించి రాష్ట్రంలోని ప్రతి కార్మికునికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా వివిధ కారణాల వల్ల చనిపోయిన ఐపీ హోల్డర్స్ కి శాశ్వత పెన్షన్ ను మంత్రి మాజీ హైకోర్టు జడ్జి చేతుల మీదగా అందజేశారు.ఈ కార్యక్రమం లో మరో ముఖ్య అథితి గా హైకోర్టు మాజీ జడ్జి ఉమాకా దుర్గ ప్రసాద్, ఈఎస్ఐసి రీజినల్ డైరెక్టర్ రామారావు, జాయింట్ డైరెక్టర్ ప్రణవ్ కుమార్, స్టేట్ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, జాయిన్ డైరెక్టర్ రాము ఈ ఎస్ ఐ సి సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

●ఎప్పటికప్పుడు సరఫరాను పర్యవేక్షిస్తున్నాం ● గృహ వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం● గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా నిఘా బృందాలు ● అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై ఉన్నతాధికారులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ టెలీ కాన్ఫరెన్స్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి 'రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు. ప్రజలెవరూ దీనిపై అనవసరమైన ఆందోళనకి గురి కావాల్సిన అవసరం లేద'ని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతానికి ఇబ్బంది ఏమీ లేదని తెలిపారు. కీలకమైన ఈ సమయంలో ఎల్పీజీ గ్యాస్ అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా జిల్లాలవారీగా చర్యలు తీసుకోవాలనీ, ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అంతర్జాతీయ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ సరఫరా గురించి మంత్రి మనోహర్ మంగళవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రానికి అందుబాటులో ఉన్న గ్యాస్ నిల్వల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... "గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరం అయితే వాణిజ్య అవసరాలకు అందించే ఎల్పీజీ గ్యాస్ ను ప్రాధాన్యతల ప్రకారం అందించే ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతానికి రాష్ట్రానికి సంబంధించి హెచ్పీసీ విశాఖపట్నం రిఫైనరీ, మంగళూరు నుంచి వచ్చే హస్సన్ చర్లపల్లి పైపులైను, విశాఖలోని హెచ్పీసీ, బీపీసీ, ఐఓసీల ద్వారా రాష్ట్రం నుంచి సరఫరా అవుతున్న గ్యాస్ సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. రోజువారీ అవసరాలకు సరిపడా నిల్వల్లో ఏ మాత్రం తేడా వచ్చినా, ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముందుకు వెళ్తాం. రాష్ట్ర ప్రజలు ఇబ్బందులుపడకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి.బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా నిఘా పర్యవేక్షణ ప్రత్యేక నిఘా బృందాలను నియమించుకొని గ్యాస్ పక్కదోవ పట్టకుండా జాయింట్ కలెక్టర్లు నియంత్రించాలి.

## తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా

# అమరావతి అభివృద్ధి

● స్వయం ఆర్థిక ప్రాజెక్టులపై దృష్టి ● క్రీడలు, పర్యాటక రంగాలకు భారీ ప్రాధాన్యం ● పెట్టుబడుల కోసం కంపెనీలతో నిరంతర సంప్రదింపులు ● 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు గర్వంగా అందించేలా రాజధాని నిర్మాణం జరగాలని అధికారులకు సూచించారు. రాజధానిలో స్వయం ఆర్థిక ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగిన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధి కారులకు ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించేలా స్వయం ఆర్థిక ప్రాజెక్టులను తీసుకురావాలని సూచించారు. పెట్టు బడులకు ఆసక్తి చూపుతున్న కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని చెప్పారు. సమా వేశంలో భాగంగా రాజధానిలో భూముల కేటాయింపు, సచివాలయం మరియు హెచ్ఓడీ టవర్లలో కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. సీఆర్డీఏ ప్రతిపాదించిన పలు అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజధాని పరిధిలోని నీరుకొండలో చేపట్టబోయే పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళు ,, అమ్యూజ్మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రోజూ పలు కార్యక్రమాలు జరిగేలా ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.క్రీడలు భవిష్యత్తులో పెద్ద ఆదాయ వనరుగా మారతాయని సీఎం పేర్కొన్నారు. బీసీసీఐ, ఐసీసీ సంస్థల ఉదాహరణలను చూపిస్తూ క్రీడలు పెద్ద ఎకానమీగా మారుతున్నాయని చెప్పారు. అందుకే అమరావతిలో స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు.పెట్టుబడుల విషయంలో ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. సంయుక్త రాష్ట్ర కాలంలో టీడీపీ ప్రభుత్వ సమయంలో సైబర్ సిటీలో పెట్టుబడి పెట్టలేకపోయామని ఇప్పుడు కొన్ని సంస్థలు విచారం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని కోల్పోవద్దనే ఆలోచనతో పెట్టుబడి దారులు ముందుకొస్తున్నారని చెప్పారు.

పెట్టుబడిదారులతో నిరంతరం ఫాలోఅప్ చేయాలని, రాజధానిలో జరుగుతున్న పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులకు సీఎం సూచించారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్కు మంచి గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి శాఖ, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

59వ సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన నిర్ణయాలు

-సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ) కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్లు భూమి కేటాయింపు

-తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాల భూమి కేటాయింపు

- పంచాయతీరాజ్ విభాగంలోని ఏపిఎస్ఐఆర్డి కి 5 ఎకరాల భూమి కేటాయింపు- ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్లలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు రూ.2316 కోట్ల పరిపాలనా అనుమతులు

- రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం.

## పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు ఆధునిక దేవాలయం

● పుష్కరాల నాటికి పనుల పూర్తి లక్ష్యం ● నాణ్యత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదు ● రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్కు ఆధునిక దేవాలయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను ఆయన స్థలస్థాయిలో పరిశీలించారు. ఇంజినీరింగ్ నిపుణులు, సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలవరం పూర్తి అయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని చెప్పారు.ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టంగా సూచించారని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో కీలకమైన డయాఫ్రాగం వాల్ దెబ్బతిన్న నేపథ్యంలో నిపుణులు మరమ్మతులు సరిపోతాయని చెప్పినా, ప్రజల భద్రత, నాణ్యత దృష్ట్యా కొత్త డయాఫ్రాగం వాల్ నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. కేంద్ర జల కమిషన్ (సిడబ్ల్యూసి) డిజైన్ల ప్రకారం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ప్రతినిధులు కూడా ఈ పనులను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు.మొత్తం 1372 మీటర్ల కొత్త డయాఫ్రాగం వాల్లో ఇప్పటికే 1300 మీటర్ల నిర్మాణం పూర్తైందని, ఈ నెలాఖరుకల్లా మొత్తం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నేలను బలపరిచే వైబ్రో కంపాక్షన్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రాజెక్టుకు కీలకమైన కుడి, ఎడమ కాల్వల అనుసంధాన పనులను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.నిర్వాసితుల పునరావాసానికి 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.700 కోట్ల పరిహారం అందించారని, కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చిన తర్వాత మరో రూ.1900 కోట్లను రెండు విడతలుగా పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. పరిహారం పేరుతో కొందరు మధ్యవర్తులు నిర్వాసితులను మోసం చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.ప్రాజెక్టు నిర్మాణంపై వచ్చే సూచనలు, విమర్శలు, అభిప్రాయాలను స్వాగతిస్తున్నామని, అయితే నాణ్యతా ప్రమాణాలు, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు అడ్మిన్ అభిషేక్, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వడగాల్పులపై రాష్ట్రం అలర్ట్ !

● 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026' ఆవిష్కరణ ● ఎండల తీవ్రత పై అప్రమత్తం... ● మధ్యాహ్నం 12 నుంచి 4 వరకు బహిరంగ పనుల సమయాలు మార్చాలి ● ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి ● హోం, విపత్తు నిర్వహణల మంత్రి వంగలపూడి అనిత



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మనుషులు, పశువుల ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్డిఎంఏ ) కార్యాలయంలో కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'హీట్వేవ్ యాక్షన్ ప్లాన్-2026'ను మంత్రి ఆవిష్కరించారు.ఎండలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ప్రజల ప్రాణాలను రక్షించడం అధికారుల తొలి కర్తవ్యమని మంత్రి పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ నుంచి వచ్చే హెచ్చరికలను ప్రజలకు వెంటనే చేరవేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వడగాల్పుల కారణంగా ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో జరిగే పనులను పునఃవ్యవస్థీకరించాలని ఆదేశించారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హీట్స్ట్రోక్ బాధితుల కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలు, మందులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖకు సూచించారు.బస్ స్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో కూల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాల సహకారంతో మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో చెరువులు, నీటి ట్యాంకులను సక్రమంగా నిర్వహించి పశువులకు నీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.వేసవి కారణంగా విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను కోరారు. అలాగే దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, వైద్య శిబిరాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, గుంటల్లో ఆడేటప్పుడు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.అగ్నిమాపక శాఖ ఆసుపత్రులు, హోటళ్లు, ప్రైవేట్ భవనాల్లో ఫైర్ సేఫ్టీ, వైరింగ్ను పరిశీలించాలని ఆదేశించారు. ఎండల తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాష్ట్ర కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్లను మంత్రి అనిత ఆదేశించారు.విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రకర్ జైన్ మాట్లాడుతూ మధ్య ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత వేసవి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్డీఆర్ఎఫ్ ఐజీపీ రాజకుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ జ్ఞానసుందర్, జిల్లా కలెక్టర్లు, డీఆర్వోలు వర్చువల్గా పాల్గొన్నారు.

మన బడి-మన భవిష్యత్‌కు చేయూత


## బోగోలు పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు

●బోగోలు మండల అభివృద్ధికి అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ భారీ విరాళం ●ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల అభివృద్ధికి రూ.5 కోట్లు ● మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణకుమార్ దంపతులు

నెల్లూరు జిల్లా బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణకుమార్ దంపతులు ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.5 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం పేదల సాధికారత కోసం చేపట్టిన పీ-4 కార్యక్రమానికి తమ ట్రస్ట్ సహకారం అందించనున్నట్లు వారు తెలిపారు. 'మన బడి-మన భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా బోగోలు మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి ఈ నిధులు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించారు.ఇదిలా ఉండగా, బోగోలు మండలం కోవ్వూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు, కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి మరో రూ.5 కోట్ల సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు.




## విద్యుత్, పౌర సేవల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి సచివాలయంలోని అర్టిజీఎస్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల, పౌర సేవల పనితీరు పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పౌర సేవల వ్యవస్థ, విద్యుత్ సరఫరా వ్యవస్థ, పాఠశాలలు, ఉన్నత విద్యా విభాగాలు, ఇతర శాఖల పనితీరు సమీక్షకు వచ్చాయి. విద్యుత్ శాఖ అధికారులు సమీక్షలో వివరించగా, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 14,013 మెగావాట్లుగా పెరిగిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి ముఖ్యమంత్రి అధికారులు దృష్టి సారించారు.సమావేశంలో మంత్రి కొలుసు పార్థ సారధి, సీఎస్ సాయి ప్రసాద్, ఐటీ, ప్లానింగ్, మైనింగ్, పాఠశాలలు, ఉన్నత విద్యా విభాగాల అధికారులు పాల్గొన్నారు. అదనంగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా, డిమాండ్ అంశాలపై డిస్కమ్లకు సమగ్ర ఆడిట్ రిపోర్ట్ ఇవ్వమని సూచించారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు

● పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు ● ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన వేడుకల రద్దు ● ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కీలక నిర్ణయం ● జిల్లా, నగర, మండల కేంద్రాల్లో స్థానికంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలన్న పవన్ ● 17వ తేదీ వరకూ ఉద్యమి సభ్యత్వ నమోదు పొడిగింపు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ప్రణాళికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 14న పిఠాపురంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించాలని జనసేన తొలుత నిర్ణయించింది. అయితే, ఆ వేడుకలను రద్దు చేస్తున్నట్లు పార్టీ అధినేత,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితులపై అందిన నివేదికలను దృష్టిలో ఉంచుకుని జనసైనికుల క్షేమం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.తొలుత పిఠాపురం వేదికగా రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని భావించినప్పటికీ, ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యూహం మార్చారు. రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బదులుగా, ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా, నగర, మండల కేంద్రాల్లో ఎక్కడికక్కడ స్థానికంగానే ఘనంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. మార్చి 14 అనేది జనసైనికులకు, వీర మహిళలకు ఒక పండగలాంటి రోజని, ఆ ఉత్సాహం తగ్గకుండా స్థానిక స్థాయిలోనే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

పిఠాపురంలో భారీ సభ రద్దు కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన కార్యాలయాలు పండుగ వాతావరణానికి సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గాల వారీగా పార్టీ జెండా ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలతో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

17వ తేదీ వరకూ ఉద్యమి సభ్యత్వ నమోదు పొడిగింపు : జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా నమోదవుతోంది. ఫిబ్రవరి 26వ తేదీన మొదలైన సభ్యత్వ నమోదు ఊరూరా సాగుతోంది. ఆంధ్ర ప్రదేశ్ తోపాటు పొరుగు రాష్ట్రాల్లో ఉన్న జనసేన శ్రేణులు, అభిమానులు సభ్యత్వాన్ని పొందుతున్నారు. ప్రవాస భారతీయులు ఆన్ లైన్ ద్వారా సభ్యత్వాన్ని తీసుకొంటున్నారు. సభ్యత్వ నమోదు గడువును 17వ తేదీ వరకూ పొడిగించాలని జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిర్ణయం తీసుకున్నారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 10వ తేదీతో ముగుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి సభ్యత్వ నమోదు గడువు పెంచాలనే విజ్ఞప్తులు కేంద్ర కార్యాలయానికి వచ్చాయి. అదే విధంగా పార్టీ శాసన సభ్యులు సైతం మరి కొద్ది రోజులు గడువు అవసరమని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలయ్యే సమయంలో అసెంబ్లీ ఉండటంతో ఆ సమావేశాల్లో నిమగ్నమయ్యామని... సభ్యత్వ నమోదు ప్రక్రియని తమ నియోజక వర్గంలోని ప్రతి ఊరిలోనూ ఒక వేడుకలా కొనసాగిస్తామని విజ్ఞప్తి చేయడంతో 17వ తేదీ వరకూ గడువు పొడిగించారు.

## గ్రామ పంచాయతీలకు కొత్త స్వరూపం !

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల పునర్వర్గీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం రూర్బన్ పంచాయతీలలో పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఇప్పటివరకు మూడు రకాలుగా ఉన్న పంచాయతీలను, ఇకపై జనాభా, వార్షిక ఆదాయం ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఇందులో భాగంగా పట్టణ లక్షణాలు సంతరించుకుంటున్న పెద్ద గ్రామాలను గుర్తిస్తూ కొత్తగా 'రూర్బన్' (రూరల్, అర్బన్) పంచాయతీ కేటగిరీని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పరిపాలన, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

కొత్తగా నాలుగు కేటగిరీలు..

రూర్బన్ పంచాయతీ అయితే, 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో అయితే 5 వేలకు పైగా జనాభా ఉంటే సరిపోతుంది. ఈ పంచాయతీలలో పట్టణ తరహా సౌకర్యాలు కల్పిస్తారు.

గ్రేడ్-1 పంచాయతీ అయితే, 3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2,500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉండాలి. మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలు ఈ గ్రేడ్ కిందికి వస్తాయి.గ్రేడ్-2 పంచాయతీ అయితే, 2 వేల లోపు జనాభా ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 1,500 నుంచి 2 వేల మధ్య ఉండాలి.

గ్రేడ్-3 పంచాయతీ అయితే, 1,500 కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలను ఈ కేటగిరీలో చేర్చారు.ఈ నూతన వర్గీకరణతో పంచాయతీలకు వాటి జనాభా, ఆదాయ వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

